నమస్తే తెలంగాణ
# నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
24 జూలై 2024
పేజీలు 8


## ప్రీ క్లినికల్ నెట్‌వర్క్

ఆసియా ఖండంలో మొట్టమొదటి 'ప్రీ క్లినికల్ నెట్‌వర్క్ సౌకర్యాన్ని' హర్యానాలోని ఫరీదాబాద్‌లో అందుబాటులోకి తెచ్చారు. ప్రపంచంలో ఈ తరహా కేంద్రం ఇది తొమ్మిదోది. జాతీయ, అంతర్జాతీయ పరిశోధన సంస్థలు, ఆస్పత్రులు, పరిశ్రమలకు ఇది నోడల్ ఏజెన్సీగా పని చేస్తుంది.

## జాతీయం

### ఎస్సీ జాబితాపై సుప్రీంకోర్టు తీర్పు

- ఆర్టికల్ 341లోని ఎస్సీ జాబితాను రాష్ట్రాలు మార్పు చేయలేవని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. తంతి-తంత్వా అనే సామాజిక వర్గానికి బీహార్ రాష్ట్రంలో ఎస్సీ హోదా కల్పించారు. 2015లో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయాన్ని గతంలో బీహార్ హైకోర్టు సమర్థించింది. కానీ తాజాగా సుప్రీంకోర్టు తప్పు పట్టింది. 341 (1), 341 (2)లను తాజా తీర్పులో ఉటంకించింది. ఆర్టికల్ 341 (1) ప్రకారం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎస్సీ జాబితాలో ఎవరిని చేర్చాలన్నది రాష్ట్రపతికి ఉన్న అధికారం, ఆర్టికల్ 341 (2) ప్రకారం దీన్ని మార్పు చేసే అధికారం పార్లమెంట్‌కు ఉంటుంది.

### పీఎం శ్రీ పాఠశాలలు

- పీఎం శ్రీ పాఠశాలల పథకాన్ని అమలు చేసేందుకు నిరాకరించడంతో సమగ్ర శిక్షా అభియాన్ నిధులను పంజాబ్, పశ్చిమబెంగాల్, ఢిల్లీ ప్రభుత్వాలకు కేంద్రం నిలిపివేసింది. ప్రభుత్వ పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా మార్చేందుకు ఉద్దేశించిందే పీఎం శ్రీ పాఠశాలల పథకం. ఇది కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం. దీనికి రూ.27,360 కోట్లు కేటాయించారు. 2022-23 నుంచి 2026-27 వరకు దీన్ని అమలు చేయనున్నారు. దేశ వ్యాప్తంగా 14,500 పాఠశాలలను పీఎం శ్రీ పాఠశాలలుగా మార్చాలన్నది లక్ష్యం.



### మనస్

- ఎంఏఎన్ఏఎస్ అనేది సంక్షిప్త రూపం- దీన్ని విస్తరిస్తే మాదక పదార్థ నిషేధ సూచ్నా కేంద్రం. అంటే మత్తు కలిగించే పదార్థాలను నిషేధించేందుకు ఉద్దేశించింది. వీటి నియంత్రణకు తొలిసారిగా టోల్ ఫ్రీ నంబర్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. 1933గా ఈ నంబర్‌ను నిర్ణయించారు.

### స్థానిక రిజర్వేషన్

- ఐటీ, ఐటీఈఎస్, పరిశ్రమలు, కర్మాగారాలు తదితర అన్ని ప్రైవేట్ సంస్థల్లోని ఉద్యోగాల్లో స్థానికులకు రిజర్వేషన్లు కల్పించాలని కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పరిశ్రమల్లో సి, డి గ్రేడ్ ఉద్యోగాల్లో 100% కర్ణాటక వాసులకే కేటాయిస్తారు. మేనేజ్‌మెంట్ ఉద్యోగాల్లో 50%, నాన్ మేనేజ్‌మెంట్ ఉద్యోగాల్లో 75% రిజర్వేషన్ ఉండనుంది. 15 సంవత్సరాలు రాష్ట్రంలో ఉండటంతో పాటు భాష మాట్లాడటం, రాయడం, సెకండరీ స్కూల్ సర్టిఫికెట్ తదితర నిబంధనలను చేర్చారు.

### లడ్డూకు జీఐ

- ఒడిశా రాష్ట్రానికి చెందిన మాగ్జీ లడ్డూకు జీఐ ట్యాగ్ దక్కింది. ఈ రాష్ట్రంలోని కలహండి జిల్లాలో ఈ లడ్డూను మొదట తయారు చేసినట్లు భావిస్తున్నారు. ముఖ్యంగా మజిస్ అనే గిరిజన సామాజిక వర్గం ఈ ఆహార



పదార్థాన్ని స్వీకరిస్తుంది. వివిధ వేడుకల్లో ఇది తప్పనిసరిగా ఉండాల్సిన వంటకం.

### ఒక శాస్త్రవేత్త ఒక ఉత్పత్తి

- ఒక శాస్త్రవేత్త ఒక ఉత్పత్తిని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సంస్థ జూలై 16న ప్రారంభించింది. మొత్తం 5521 శాస్త్రవేత్తలకు లక్ష్యాన్ని ఇచ్చింది. ఏదైనా ఉత్పత్తి లేదా సాంకేతికత లేదా నమూనా లేదా భావన లేదా ఉత్తమమైన ప్రచురణను శాస్త్రవేత్తలు తీసుకు రావాలి.

### రాజ్యాంగ హత్య రోజు

- ఏటా జూన్ 25న రాజ్యాంగ హత్య రోజుగా నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. 1975లో ఇదే రోజున దేశంలో అత్యవసర పరిస్థితిని విధించారు. ఆ సమయంలో ప్రజల ప్రాథమిక హక్కులు హరించారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

### మొక్కలు నాటడంలో రికార్డు

- మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ నగరంలో 24 గంటల వ్యవధిలో అత్యధిక సంఖ్యలో మొక్కలు నాటారు. దీంతో గిన్నిస్ బుక్‌లో ఇండోర్ చోటు సంపాదించింది. 1.1 మిలియన్ల మొక్కలను ఒక్క రోజులో నాటారు.

## అంతర్జాతీయం

### యూఎన్‌జీఏ

- ఉక్రెయిన్‌లోని అణు విద్యుత్ ప్రాజెక్టులకు భద్రత, రక్షణ కల్పించాలని ఐక్యరాజ్య సమితి సాధారణ సభ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం నేపథ్యంలో ఈ తీర్మానం చేశారు. అణు ప్రాజెక్టులకు సమీపంలోనే రష్యా దాడులు చేయడాన్ని ఖండించింది.

### యునెస్కో



- యునెస్కో ఆధ్వర్యంలో వరల్డ్ హెరిటేజ్ యంగ్ ప్రొఫెషనల్స్ ఫోరం సమావేశం న్యూఢిల్లీలో జూలై 14 నుంచి 23 వరకు నిర్వహించారు. ఈ సమావేశ ఇతివృత్తం '21వ శతాబ్దంలో ప్రపంచ వారసత్వం: సామర్థ్యాల నిర్వహణ-యువతకు అవకాశాల అన్వేషణ'. అదేవిధంగా 46వ యునెస్కో సమావేశం జూలై 21న ప్రారంభమైంది. 31 వరకు కొనసాగనుంది. ఈ సమావేశం భారత్‌లో జరగడం ఇదే ప్రథమం.

### నేపాల్

- నేపాల్‌లో ప్రభుత్వం మారింది. పుష్ప కమల్ దహల్ ప్రచండ సభా విశ్వాసాన్ని కోల్పోవడంతో ప్రధాని పదవికి రాజీనామా చేశారు. కేపీ శర్మ ఓలీ ఆ దేశ నూతన ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు.

### చైనా

- ప్రపంచంలో మొట్టమొదటి ద్వి స్తంభ సౌర థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను చైనాలోని గన్సు ప్రావిన్స్‌లో ప్రవేశపెట్టారు. 2024 చివరి నాటికి ఇది పని చేయనుంది. ఇవి హీలియోస్టాట్స్ అనే అద్దాల ఆధారంగా పనిచేయనున్నాయి. లక్షిత ప్రదేశంలో సూర్య కిరణాలు పడినప్పుడు దాని నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తారు.

### యూఏఈ

- అబు ధాబిలోని ఒక వీధికి భారత సంతతికి చెందిన వైద్యుడు జార్జ్ మాథ్యూ పేరు పెట్టారు. ఆ దేశంలో వైద్య రంగ అభివృద్ధికి చేసిన కృషికి ఈ నిర్ణయం తీసుకున్నారు.

### రామాయణ మందిరం

- ప్రపంచంలోనే అతిపెద్ద రామాయణ మందిరాన్ని బీహార్ రాష్ట్రంలోని తూర్పు చంపారన్‌లో నిర్మించనున్నారు. అయోధ్యలో నిర్మించనున్న రామాలయం కంటే ఇది మూడు రెట్లు పెద్దది.

### హైడ్రోజన్ నౌక

- ప్రపంచంలోనే మొట్టమొదటిసారి హైడ్రోజన్ ఆధారిత వాణిజ్య నౌకను అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో అఖాతంలో ప్రవేశపెట్టారు. దీని పేరు ఎంవీ సీ చేంజ్. 75 మంది వరకు ఇందులో ప్రయాణించే వీలుంటుంది.



## రోజులు-ప్రాధాన్యం

### జూలై 18

- నెల్సన్ మండేలా అంతర్జాతీయ రోజుగా నిర్వహిస్తారు. 1918, జూలై 18న మండేలా జన్మించారు. 1994లో దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడారు. 1990లో భారతరత్న అవార్డ్, 1993లో నోబెల్ శాంతి బహుమతి పొందారు.

### జూలై 17

- అంతర్జాతీయ న్యాయ ప్రపంచ రోజుగా నిర్వహిస్తారు. 1998లో ఇదే తేదీన రోమ్ చట్టాన్ని ఆమోదించారు. ఫలితంగా అంతర్జాతీయ క్రిమినల్ కోర్ట్ ఏర్పాటయ్యింది. నెదర్లాండ్స్‌లోని ది హేగ్ నగరంలో ఈ కార్యాలయ ప్రధాన కేంద్రం ఉంది.

### జూలై 15

- ప్రపంచ నైపుణ్య దినోత్సవంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఇతివృత్తం 'శాంతి, అభివృద్ధికి యువత నైపుణ్యాలు'.

## ఆర్థికం

### వృద్ధి రేటు అంచనాలు

- భారత వృద్ధి రేటుకు సంబంధించి అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ఆసియా అభివృద్ధి బ్యాంక్ అంచనాలను ప్రచురించాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్ 7% వృద్ధి సాధిస్తుందని రెండు సంస్థలు కూడా పేర్కొన్నాయి. ప్రైవేట్ వినియోగం భారత్‌లో పెరగడమే దీనికి ప్రధాన కారణం అని పేర్కొన్నాయి. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధిని కలిగిన ఆర్థిక వ్యవస్థగా భారత్ ఉందని తెలిపాయి.

## వార్తల్లో వ్యక్తులు

### రాబర్ట్ మెట్సోలా



- యూరోపియన్ పార్లమెంట్‌కు ప్రెసిడెంట్‌గా మాల్టా దేశానికి చెందిన రాబర్ట్ మెట్సోలా ఎన్నికయ్యారు. ఈ పదవిని ఆమె చేపట్టడం వరుసగా రెండోసారి. ఈ ఘనత దక్కించుకున్న తొలి మహిళ ఆమె.

### నరేంద్ర మోదీ

- ప్రపంచ వ్యాప్తంగా ఎక్స్‌లో అత్యధిక మంది ఫాలోవర్లను కలిగిన నేతగా ప్రధాని నరేంద్ర మోదీ రికార్డ్ సృష్టించారు. 100 మిలియన్లకు పైగా ఆయనకు ప్రస్తుతం ఎక్స్‌లో ఫాలోవర్లు ఉన్నారు.

### పాల్ కగామే



- రువాండా ఎన్నికల్లో పాల్ కగామే విజయం సాధించారు. ఆ దేశ జాతీయ ఎన్నికల కమిషన్ నివేదిక ప్రకారం 99.15% ఓట్లు ఆయనకు అనుకూలంగా వచ్చాయి. వరుసగా ఆయన నాలుగోసారి బాధ్యతలను స్వీకరించారు.

### గీతానాస్ నౌసెడా

- లిథువేనియా దేశానికి గీతానాస్ నౌసెడా అధ్యక్షుడిగా వరుసగా రెండోసారి బాధ్యతలు స్వీకరించారు.

### సుదర్శన్ పట్నాయక్



- భారతదేశ ప్రముఖ సైకత శిల్పకారుడు, ఒడిశా రాష్ట్రానికి చెందిన సుదర్శన్ పట్నాయక్‌కు అవార్డు లభించింది. రష్యాలో నిర్వహించిన అంతర్జాతీయ సైకత శిల్ప చాంపియన్‌షిప్‌లో గోల్డెన్ శాండ్ మాస్టర్ అవార్డ్‌ను గెలుచుకున్నాడు. ఇసుకతో రథం, పూరి జగన్నాథుడు, బలరాం అనే భక్తుడిని శిల్పంగా మలిచి ఈ అవార్డును గెలుపొందాడు. జూలై 4 12 వరకు ఈ పోటీ కొనసాగింది.


## క్రీడలు

### యూరోపియన్ సాకర్



- యూరోపియన్ సాకర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో స్పెయిన్ విజయం సాధించింది. ఫైనల్‌లో ఇంగ్లండ్‌ను ఓడించి నాలుగోసారి కప్‌ను అందుకుంది. ఈ టోర్నీని జర్మనీలో జూన్ 14 నుంచి జూలై 14 వరకు నిర్వహించారు. మొత్తం 24 జట్లు ఇందులో పాల్గొన్నాయి.

### కోపా అమెరికా



- 2024 కోపా అమెరికా సాకర్ ఫుట్‌బాల్ టోర్నీని అర్జెంటీనా గెలుచుకుంది. తుదిపోరులో కొలంబియాను ఓడించింది. ఈ టోర్నీని అర్జెంటీనా గెలవడం ఇది 16వ సారి. జూన్ 20 నుంచి జూలై 14 వరకు ఈ టోర్నీ కొనసాగింది.

## తెలంగాణ

### విచారణ కమిషన్

- విద్యుత్‌కు సంబంధించి గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల విచారణకు ప్రభుత్వం నియమించిన కమిషన్ మార్పులను సుప్రీంకోర్టు సూచించింది. విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ నరసింహారెడ్డిని మార్చాలని ఆదేశించింది. ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలుకు యాదాద్రి, భద్రాద్రి సబ్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు తీసుకున్న నిర్ణయాలపై ఈ విచారణ కమిషన్‌ను నియమించారు.

### కాటమయ్య రక్షణ కవచం



- కాటమయ్య రక్షణ కవచం కిట్ల పంపిణీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో ప్రారంభించారు. గీత కార్మికులు కింద పడి ప్రాణాలు కోల్పోకుండా రూపుదిద్దిన కవచం ఇది.

### న్యూట్రిషన్ చాంపియన్

- పోషకాహార లోపం నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలకు న్యూట్రిషన్ చాంపియన్స్ అనే పుస్తకాన్ని యునిసెఫ్ ప్రచురించింది. దీన్ని జాతీయ ఆరోగ్య మిషన్‌తో కలిపి అవగాహన కల్పిస్తారు.

### నేరెళ్ల శారద



- తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద బాధ్యతలు స్వీకరించారు.

### అక్షరాస్యత కార్యక్రమం

- న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రామ్‌కు పైలట్ ప్రాజెక్ట్‌గా చందారం గ్రామం ఎంపికయ్యింది. ఇది మంచిర్యాల జిల్లాలో ఉంది. గ్రామంలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు ఉద్దేశించిన కార్యక్రమం ఇది.

### సత్యనారాయణ గౌడ్

- తెలంగాణ హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌గా సత్యనారాయణ గౌడ్ బాధ్యతలు చేపట్టారు.


వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411